క్లుప్తంగా

సన్మానం



పర్వతగిరి : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు (హెచ్‌ఎం) కందుకూరి నవీన్‌కుమార్‌ను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పాక రమేశ్‌బాబు, ఉపాధ్యాయులు మంగళవారం శాలువాతో సన్మానించారు. తొలుత ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టగా అభినందించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ పరశురాములు, ఉపాధ్యాయులు కె.శ్రీధర్, ఆర్.అశోక్‌కుమార్, డాక్టర్ మడత భాస్కర్, పి.అనిల్‌కుమార్, డి.రవికుమార్, బి.తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్



రాజ్‌కుమార్

దుగ్గొండి : మండలంలోని పానకల్‌కు చెందిన దాసి రాజ్‌కుమార్‌కు అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ మంగళవారం ప్రకటించింది. 'గది ఉష్ణోగ్రత వద్ద అస్థిర సేంద్రియ సమ్మేళనం, సెన్సింగ్ కోసం స్వచ్ఛమైన డోపింగ్ టైటానియం ఆక్సైడ్ సన్నని పొరల నిక్షేపణ లక్షణాలపై అధ్యయనాలు' అంశంపై ఉమామహేశ్వరి పర్యవేక్షణలో పరిశోధన పత్రం సమర్పించారు. రాజ్‌కుమార్‌ను పలువురు అభినందించారు.

'పీరీల షెడ్ తొలగించాలి'

సంగెం : మండల కేంద్రంలోని పాత బొడ్రాయి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక పీరీల షెడ్‌ను అధికారులు తొలగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో బందెలదొడ్డి స్థలంలో పీర్లను పెట్టి తీసేశాక 20 ఏళ్లుగా స్థానిక గణేశ్ మండపం ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది పీరీల షెడ్ తీసేయక పోగా స్థలం తమదేనంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారని తెలిపారు. సదరు భూమి గ్రామ కంఠంలోనిదని, అధికారులు స్పందించి వెంటనే షెడ్ తొలగించి గణపతి ఉత్సవాల నిర్వహణకు అనుమతించాలని కోరారు.

'దస్తావేజు లేఖరులకు సహకరించాలి'



నర్సంపేట : దస్తావేజు లేఖరులకు సహకరించాలని సంఘం అధ్యక్షుడు కాట శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని నూతన కమిటీ సబ్ రిజిస్ట్రార్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, వినతిపత్రం అందజేసింది. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. విద్యావంతులైన పలువురు దస్తావేజు లేఖరులుగా ఉపాధి పొందుతున్నారని చెప్పారు.

అనారోగ్యంతో పారిశుద్ధ్య కార్మికుడి మృతి



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు తాటికాయల కుమారస్వామి (40) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల కోసం గ్రామ పంచాయతీ తరపున పంచాయతీ కార్యదర్శి ఆనంద్ రూ.10 వేల నగదు అందజేశారు. మాజీ సర్పంచ్ పెండ్యాల మమత రాజు దంపతులు, తదితరులు కుమారస్వామి మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పుట్టపాక రాజేందర్, శ్రీరామోజు భిక్షపతి, మాదాసి సదయ్య, బుగ్గ బచ్చయ్య, జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ముస్కు రాజు, పోలోజు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని ధర్మారం ప్రాంతానికి చెందిన సిలువేరు శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా స్థానిక శ్రీ వారాయి పరపతి సంఘం సభ్యులు బాధిత కుటుంబానికి మంగళవారం 25 కిలోల బియ్యంతోపాటు ఆర్థికసాయం అందించారు. తొలుత శాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. శాంతమ్మ మృతి బాధాకరమన్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నర్సంపేట రూరల్ : మట్టి విగ్రహాలతో హెచ్‌ఎం, టీచర్లు, విద్యార్థులు



నర్సంపేట : చెన్నారావుపేటలో..



మట్టి వినాయకులనే పూజిద్దాం

నర్సంపేట/నర్సంపేట రూరల్/ఖానాపురం/దుగ్గొండి/పర్వతగిరి : వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి విగ్రహాలనే పూజిద్దామంటూ పలువురు నినదిస్తున్నారు. నర్సంపేటకు చెందిన బాలుడు వివేక్ ఆదిత్య మంగళవారం స్కేటింగ్ చేస్తూ అవగాహన కల్పించాడు. నర్సంపేట, ఖానాపురం, దుగ్గొండి, నాచినపల్లి, చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల్లోని హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి స్థానికులకు పంపిణీ చేశారు. ఉత్తమ మట్టి గణపతులను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు స్వరూప, కుమారస్వామి, తేజావత్ జయ, కందుకూరి నవీన్‌కుమార్, రామస్వామి, జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దుగ్గొండి : మట్టి విగ్రహాలతో విద్యార్థులు, టీచర్లు



ఖానాపురం : ఎకో క్లబ్ ఆధ్వర్యంలో..



నర్సంపేట : స్కేటింగ్‌తో విద్యార్థి వివేక్

సమస్యలను సత్వరమే పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రామ్మోహన్‌రెడ్డి, నాయకులు

● బీజేపీ కార్యవర్గ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి

రాయపర్తి : మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, రైతులకు ఇబ్బందిగా మారిన క్రమంలో సింగిల్ ఫేజ్ కరెంట్ సరఫరాను అప్‌గ్రేడ్ చేయాలని, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని తాగునీటి సమస్యను పరిష్కరించడంతోపాటు అన్ని గ్రామాల్లో మురుగు కాల్వలు నిర్మించాలని, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూనె అనిల్, జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె కుమార్, పాలకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పూసల శ్రీమాన్, జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్లకొండ రవి, యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రావణ్ కుమార్, నాయకులు నిమ్మల అనిల్, మందపురి రాజు, పెండ్యాల గణేశ్, చిర్ర నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం తీసుకురావాలి

● రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్‌రావు

సంగెం : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జయకేతనం ఎగరేసి బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం తీసుకురావాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు శ్రేణులను కోరారు. మండలంలోని కాట్రపల్లి, గుంటూరుపల్లి, కాపులకనిపర్తి, ఆశాలపల్లి, గవిచర్ల, వెంకటాపూరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశాలకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు యూరియా కోసం ఇబ్బంది పడుతుండగా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రైతులకు ఇస్తానని మభ్యపెట్టి ఎగ్గొట్టిన రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సారంగపాణి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, మల్లయ్య, వీరాచారి, సాగర్‌రెడ్డి, కుమారస్వామి, గోవర్ధన్, బాలకృష్ణ, రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుచరిత మృతిపై విచారణ చేయించాలి

● ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

నర్సంపేట : పెండ్యాల సుచరిత అనుమానాస్పద మృతి నేపథ్యంలో హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం రాజశేఖర్ మాట్లాడారు. జైలులో సుచరిత మృతి చెందడం దారుణమన్నారు. జైలులోనూ రక్షణ కొరవడిందని ఆందోళన వెలిబుచ్చారు. జైలర్‌పై హత్య, అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని చెప్పారు. జైలులో హత్య జరిగిందని భావిస్తున్నామని తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని చెప్పారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ విశ్వనాథ్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు, జిల్లా ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు, మున్నూరుకాపు సంఘం జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పింఛన్ పెంపులో నిర్లక్ష్యం సరికాదు

● ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కిశోర్

సంగెం : ఆసరా పింఛన్ పెంపు నిర్లక్ష్యం చేయడం సరికాదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దామెర కిశోర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పెన్షనర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చి అనంతరం విస్మరించిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడచినా వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పింఛన్ పెంచలేదన్నారు. ఈనెల 28న గంగదేవిపల్లిలో నిర్వహించనున్న సమావేశానికి పెన్షనర్లు హాజరు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు కోదూరి రాజు, మెట్టుపల్లి కొమురయ్య, పరికి యాకమ్మ, శాంత, లక్ష్మి, కరుణ తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్లతో మాట్లాడుతున్న కిశోర్

ఏటీఎంలో చోరీకి విఫలం యత్నం?

● పోలీసులకు ఫిర్యాదు

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చోరీకి విఫలయత్నం జరిగిందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఏటీఎంలో డబ్బు తీసేందుకు యత్నించిన ఓ వ్యక్తి సాధ్యం కాకపోవడంతో ఏటీఎం డోర్ తెరిచేందుకు యత్నించినట్టు యూబీఐ హెడ్ లెనిన్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. ఇల్లందలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో మంగళవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి ప్రవేశించి డబ్బులు డ్రా చేయడానికి ప్రయత్నించాడు. డబ్బు రాకపోవడంతో ఏటీఎం డోర్ లాగాడు. ఏటీఎం ముందు భాగం రాకపోవడంతో సుమారు 15 నిమిషాల పాటు అందులోనే ఉండి తదనంతరం బయటికి వచ్చాడు. ఏటీఎంలో డబ్బులు చోరీకి గురి కానప్పటికీ ఏటీఎం ముందు భాగం డ్యామేజ్ అయింది. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా యూబీఐ బ్రాంచ్ హెడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మీడియాకు వెల్లడించారు.

గణపతి ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరి



రాయపర్తి : గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని నిర్వాహకులకు ఎస్సై ముత్యం రాజేందర్ స్పష్టం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీజే సౌండ్స్ నిర్వాహకులకు మంగళవారం ఆయన కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. డీజే పెట్టొద్దని చెప్పారు. ఉత్సవాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల మేరకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని చెప్పారు. అలాగే నిమజ్జనంలో డీజే సౌండ్స్ ఏర్పాటు నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.


నాయకుడిపై వేటుతో కాంగ్రెస్‌కు రాజీనామా

దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తొట్ల కుమారస్వామిని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ 17 కుటుంబాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి మంగళవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ కాసర్ల రాజు మాట్లాడారు. సుమారు రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం కుమారస్వామి పని చేశాడని తెలిపారు. ఆయన్ను సస్పెండ్ చేయడంతో తనతోపాటు మారెల్లి రాజు, చిరంజీవి, నర్సింహస్వామి, మూల రంగారెడ్డి, రమేశ్, కొత్తపల్లి కుమారస్వామి, తిరుపతి, హనుమంతు, తొట్ల బాబు, కామ రాజు, సందీప్, నేదురు రవి, వంగ నాగయ్య, తొట్ల రాములు, భిక్షపతి, సుధాకర్, తదితరులు రాజీనామా చేసినట్టు తెలిపారు. తామంతా తొట్ల కుమారస్వామి వెంటే ఉంటామని స్పష్టం చేశారు.

'లైన్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి'

నర్సంపేట : విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌పై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ బోడ మురళినాయక్, తండావాసులు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో మురళినాయక్ మాట్లాడారు. చెరువుకొమ్ముతండాలోని బోడతండాలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సోమవారం విద్యుత్ వైరు తెగిపోగా రాత్రి 7 గంటల సమయంలో విద్యుత్ నిలిచిపోగా సమస్యను లైన్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య దృష్టికి తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని చెప్పారు. తండావాసులంతా చీకట్లో రాత్రంతా గడపాల్సి వచ్చిందని తెలిపారు. లైన్‌మెన్ నిర్లక్ష్యంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కమీషన్ చెల్లించాలని డీలర్ల వినతి



నర్సంపేట : తమకు పెండింగ్‌లో ఉన్న కమీషన్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చెన్నారావుపేట మండల రేషన్ డీలర్లు తహసీల్దార్ మహ్మద్ ఆబిద్ అలీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఐదు నెలలుగా ప్రభుత్వం కమీషన్ ఇవ్వలేదని చెప్పారు. ప్రభుత్వ తీరుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ కమీషన్ చెల్లించడంతోపాటు ఏనెలకానెల చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డీలర్లు తొగరు మల్లారెడ్డి, కొత్వాల మమత రాజు, బాసాని శ్రీనివాస్, కస్నం సంజీవ, చిప్ప లక్ష్మయ్య, బొల్లెపల్లి సరిత రాజు, గుగులోతు వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్‌కు చెందిన సొరపు యాకయ్య (55) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న, మాజీ జెడ్పీటీసీ భానోతు పత్తినాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, నర్సంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ చీర అశోక్, కిసాన్ సెల్ అధ్యక్షుడు కర్దూరి సంపత్‌రెడ్డి, తదితరులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు.

ప్రజాదరణ ఓర్వలేకే విమర్శలు

● మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్‌రెడ్డి

నెక్కొండ : ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిపై విమర్శలు చేస్తున్నారని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 25న జరిగిన బీఆర్‌ఎస్ ధర్నా, రాస్తారోకో మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వంపై, స్థానిక ఎమ్మెల్యేపై వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. దేశవ్యాప్తంగా యూరియా కొరత ఉండగా సుదర్శన్‌రెడ్డి అవగాహనా రాహిత్యంతో వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో యూరియా కొరత లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేలా బీఆర్‌ఎస్ పడుతున్న ఉనికి ఇదే నిదర్శనమని వారు పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు గరికపాటి హన్మంతరావు, పట్టణ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ, మండల కార్యదర్శి కక్ర చెన్నారెడ్డి, నాయకులు రమేశ్, శ్రీకాంత్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రెడ్డి

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

● టౌన్ సీఐ రఘుపతిరెడ్డి

నర్సంపేట రూరల్ : ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నర్సంపేట టౌన్ సీఐ రఘుపతిరెడ్డి స్పష్టం చేశారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ నిర్మూలనకు, విద్యార్థుల భద్రతకు పోలీసు శాఖ కృతనిశ్చయంతో ఉందన్నారు. ర్యాగింగ్‌కు గురైతే విద్యార్థులు భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ర్యాగింగ్‌ను దురాచారంగా అభివర్ణించారు. తోటి విద్యార్థులను, జూనియర్లను సోదరభావంతో చూడాలని చెప్పారు. ర్యాగింగ్‌కు పాల్పడితే బాధ్యులపై పోలీసు కేసులు నమోదవుతాయని, శిక్ష తప్పదని, భవిష్యత్ నష్టపోయే ప్రమాదం ఉందని వివరించారు. విద్యార్థులు ఒకరి పట్ల మరొకరు స్నేహభావం చాటాలని ఆకాంక్షించారు. ర్యాగింగ్ నిర్మూలనకు విద్యార్థులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై అరుణ్, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్, హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగాధిపతి శ్రీనివాస్, కోఆర్డినేటర్ వంశీరాజ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రఘుపతిరెడ్డి

ఆర్థిక అక్షరాస్యతతో జీవితంలో ఉన్నతి

● ఎస్సై రాజేశ్‌రెడ్డి

నర్సంపేట : ఆర్థిక అక్షరాస్యత పాటిస్తేనే జీవితంలో సులువుగా ఉన్నతి సాధించగలరని ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి రైతు వేదికలో శ్రీధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ సంపాదన మొదలైనప్పటి నుంచి పొదుపును అలవర్చుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, వ్యాపారస్తులు, యువత, విద్యార్థులు సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఫైనాన్షియల్ లిటరసీ కోఆర్డినేటర్ (ఎఫ్‌ఎల్‌సీ) భాస్కరాచారి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలువురు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి నష్టపోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. సైబర్ నేరాల బారిన పడితే బాధితులు వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం తిలక్ కుమార్, ఏఈఓ శశికుమార్, పోలీస్ సిబ్బంది రామకృష్ణ, యాకయ్య, క్రాంతి, సాయికృష్ణ, స్వయం సహాయక సంఘం కమ్యూనిటీ కోఆర్డినేటర్ ఈదునూరి రమేశ్, సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ కీర్తన ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ గణేశ్, కళాకారులు రాజేందర్, లక్ష్మణ్, స్వయం సహాయక సంఘాల వీఓ అధ్యక్షులు భాగ్యలక్ష్మి, పరికి నాగమణి, రహీమున్నీసా బేగం, సీఏలు శ్యామ్, శరత్ బాబు, మంజుల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రాజేశ్‌రెడ్డి

బీజేపీ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి



బీజేపీలో చేరిన వారికి కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

● జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : బీజేపీ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఖానాపురం మండలంలోని కొడ్తిమాటుతండాకు చెందిన వివిధ పార్టీల్లో పని చేసిన పలువురు యువకులు బూత్ కమిటీ అధ్యక్షులు గుగులోతు సతీశ్, వెంకన్న ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు రాధారపు అశోక్ అధ్యక్షతన బీజేపీలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు అత్యధిక స్థానాల్లో అవకాశం కల్పించి ప్రజాప్రతినిధులుగా గెలిపించి క్రియాశీల రాజకీయాలకు బాటలు వేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు సూచించారు. నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు కె.యాకస్వామి, మండల ప్రధాన కార్యదర్శి కలకోటి సహదేవ్, నాయకులు భానోత్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.